
సాక్షి
బాపట్ల
బుధవారం। 24 । ఏప్రిల్ । 2024



వైభవంగా హనుమజ్జయంతి

గుంటూరుఎడ్యుకేషన్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మంగళవారం కొత్తపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో 41 రోజుల మండల దీక్షను ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 506.40 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 3,597 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భక్తిశ్రద్ధలతో గణపతి, చండీహోమం

గుంటూరుఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా గణపతి, చండీహోమాన్ని నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు కరణం వెంకటేష్ నామినేషన్



చీరాల టౌన్: చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఎన్నికల నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరగనుందని ఆ పార్టీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురంలోని ఆయన ఇంటి వద్ద నుంచి నిర్వహించనున్న ర్యాలీ ప్రసాద్ థియేటర్, కొట్లబజార్, ముంతావారి సెంటర్, గడియార స్తంభం సెంటర్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొనాలని నేతలు కోరారు.

ఎస్ఎస్‌టీ బృందాల విధులు కీలకం
-ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్ల టౌన్: ఎన్నికల నిర్వహణలో ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వేలియన్స్ టీమ్)బృందాల విధులు కీలకమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం జిల్లాలోని ఎస్ఎస్‌టీ బృందాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు సమర్థంగా నిర్వహిస్తూ, ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. జిల్లాలోని ప్రతి చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు అమర్చామని, వాహన తనిఖీలను జిల్లా కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. వాహన తనిఖీలు నిర్వహించే సమయంలో వాహనదారులు, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు, బహుమతులు, ఇతర ప్రచార వస్తువులను సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించాలని ఆదేశించారు. సీజ్ చేసిన నగదు, వస్తువుల రసీదులను సంబంధిత వ్యక్తులకు ఇవ్వాలని చెప్పారు. సీజ్ వస్తువులు తిరిగి పొందే విధానాన్ని వారికి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, ఎలక్షన్ సెల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి, సీహెచ్.సింగయ్య, నియోజకవర్గ నోడల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

27న పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష



చిలకలూరిపేట టౌన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ ఎంట్రన్స్‌ను ఈనెల 27న నిర్వహించనున్నట్లు చిలకలూరిపేట పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.డేవిడ్‌రాజు తెలిపారు. పట్టణంలోని ఏఎంజీ జూనియర్ కాలేజీలో సోమవారం అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్, జాయింట్ చీఫ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని తెలిపారు. పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, మాచర్ల పట్టణాల్లో పరీక్ష కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. చిలకలూరిపేట పట్టణంలో ఆరు కేంద్రాలలో సుమారు 2049 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సీఆర్ డిగ్రీ కళాశాల (గణపవరం), ఏఎంజీ జూనియర్ కళాశాల, శ్రీ శారదా జెడ్పీహెచ్ స్కూల్, సెయింట్ చార్లెస్ హైస్కూల్, జీఆర్ జూనియర్ కాలేజీ (కాకతీయ స్కూల్ క్యాంపస్), మోడ్రన్ గ్రీన్ వ్యాలీ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్‌గా క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి. రమాదేవి, చిలకలూరిపేట కేంద్ర అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను ఉదయం 9.45 నుంచే లోపలకు అనుమతిస్తారని తెలిపారు. 11 గంటల తర్వాత అనుమతి లేదని స్పష్టం చేశారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6200, గరిష్ట ధర రూ.8400, మోడల్ ధర రూ.7100 పలికింది.

ఆక్వాకు జగనన్న జవసత్వం

రైతులకు విద్యుత్ రాయితీ

- రూ. 1.50కే యూనిట్ విద్యుత్
- జిల్లాలో 2,986 మందికి రూ. 29.15 కోట్లు రాయితీ
- చంద్రబాబు పాలనలో పరిశ్రమ కుదేలు
- పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి



ఆక్వా చెరువులో విద్యుత్ స్తంభాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల : ఆక్వా రైతుల అభ్యున్నతికి, పరిశ్రమ అభివృద్ధికి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతులకు పలు రాయితీలు కల్పించింది. పది ఎకరాల్లోపున్న రైతులతో పాటు డీకేటీ, అసైన్డ్ భూములున్న వారికి యూనిట్ విద్యుత్‌ను సబ్సిడీపై రూ.1.50కే అందించింది. ప్రభుత్వం మిగతా రూ. 5.50 భారాన్ని భరించింది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో ఆక్వా రైతులు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యావాదాలు చెబుతున్నారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీ అమలు

బాపట్ల జిల్లాలో ఆక్వాకు సంబంధించి 3,446 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. చంద్రబాబు పాలనలో నామమాత్రం కూడా రైతులకు సబ్సిడీ ఇచ్చిన పాపాన పోలేదు. పాదయాత్రలో భాగంగా ఆక్వా రైతుల కష్టాలు స్వయంగా చూసిన అప్పటి ప్రతిపక్షనేత వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి రాగానే మొత్తం 2,986 సర్వీసులకు రాయితీ ఇచ్చారు. ఇది 95 శాతానికి సమానం. మిగిలిన సర్వీసుల్ని రాయితీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించింది.

జగన్ పాలన వచ్చాకే రాయితీ

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆక్వా పరిశ్రమకు జవసత్వాలొచ్చాయి. ఒక వైపు యూనిట్ విద్యుత్‌ను రూ.7కు కొనుగోలు చేస్తూ మరోవైపు రూ.1.50కు అందిస్తూ రైతులపై ప్రేమను చాటుకుంది. ప్రభుత్వ సాయంతో కేజీ రొయ్యల ఉత్పత్తికి రూ.15 మాత్రమే అవుతోంది. చంద్రబాబు హయాంతో పోలిస్తే వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్యుత్ చార్జీలు తగ్గడంతో ఒక్క కేజీ పైనా రైతులకు రూ. 35 ఆదా అవుతోంది. ఈ లెక్కన టన్నుకు రూ. 35 వేలు మిగులుతోంది.

పెరిగిన సాగు విస్తీర్ణం

బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం నుంచి నెల్లూరు జిల్లా కావలి వరకు తీర ప్రాంత రైతులకు విద్యుత్ సబ్సిడీ ఉపయోగకరంగా మారింది. కావలి ప్రాంతంలో 20 వేల ఎకరాలు , ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 30 వేల ఎకరాలు, బాపట్ల, రేపల్లె ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున ఆక్వా సాగులో ఉంది. పనికిరాని భూముల్లో ఆక్వా సాగు చేపట్టాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు సాగు విస్తీర్ణం పెరిగింది.



చంద్రబాబు పాలనలో కష్టాల సాగు

చంద్రబాబు పాలనలో ఆక్వా రైతుల కష్టాల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. నామమాత్రంగా కూడా సబ్సిడీ విద్యుత్ ఇవ్వలేదు. ఒక్క యూనిట్‌కి రూ. 3.86తో పాటు సర్వీసు చార్జీలు కలిపి రూ. 4 చొప్పున వసూలు చేశారు. డీకేటీ, కౌలు రైతులకు సబ్సిడీ ఊసే లేదు. ఐదెకరాల లోపు రైతులకు మాత్రమే అరకొరగా విద్యుత్ అందించారు. పైగా 20హెచ్‌పీ మోటారుకే సబ్సిడీ అంటూ కొర్రీలు పెట్టారు. టీడీపీ ప్రభుత్వ నిరాదరణతో రైతులు ఎకరం కూడా సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. కేజీ రొయ్య సాగు చేసేందుకు రూ. 40 నుంచి 50 విద్యుత్ చార్జీ అయ్యేది. దీంతో పరిశ్రమ కుదేలైంది.

సబ్సిడీతో మేలు



నాకు రొయ్యల చెరువుల పరిధిలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. బిల్లు రూ. లక్ష రూపాయలకు తగ్గకుండా వస్తోంది. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నందున నేను రూ. 49 వేలు మాత్రమే చెల్లిస్తున్నా. ప్రస్తుతం రొయ్యల సాగు పెద్దగా లాభం ఉండటం లేదు. ప్రభుత్వం విద్యుత్ రాయితీ ఇస్తుండటంతో మాకు చాలా మేలు జరుగుతోంది. ఇది లేకపోతే నష్టాల పాలు కావాల్సిందే.

– రాజు పోలిరెడ్డి, ఆక్వా రైతు, చిన్న గంజాం

అర్హత కలిగిన రైతులందరికీ సబ్సిడీ



ఆక్వా సాగు చేస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని అందజేస్తోంది. జిల్లాలో 3446 మంది ఆక్వా రైతులు ఉండగా 2986 మంది సబ్సిడీకి అర్హులుగా ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం రూ. 1.50కే విద్యుత్‌ను అందిస్తోంది. దీని వల్ల రైతులకు ఇప్పటివరకు 29.15 కోట్లు లబ్ధి చేకూరింది.

– సురేష్, మత్స్యశాఖ జిల్లా అధికారి

కోడ్ ఉల్లంఘించిన ‘ఆమంచి’

భారీ ఫ్లెక్సీలను తొలగించిన మున్సిపల్ సిబ్బంది



ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

చీరాల: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి పట్టణంలో భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంగళవారం తన నామినేషన్, పీసీసీ చీఫ్ షర్మిల బహిరంగ సభతో బల ప్రదర్శన చేయాలని భావించిన ఆయన చీరాలలోని ప్రధాన సెంటర్లలో భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం వాటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కోడ్ ఉల్లంఘించిన ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

‘ఆమంచి’పై 22 కేసులు

చీరాల: కాంగ్రెస్ పార్టీ చీరాల అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో స్థిర, చరాస్తులు, వాహనాలతో పాటుగా సీబీఐ కేసు, ఇతర కేసుల వివరాల్ని పొందుపరిచారు. ఆమంచి 22 కేసుల్లో నిందితుడు. ఆస్తుల వివరాల్లోకెళ్తే..2019 అఫిడవిట్‌లో రూ.49 లక్షల ఖరీదైన బెంజ్ కారు ఒకటి, ఇన్నోవా కారు ఉందని చూపించారు. 2024 అఫిడవిట్‌లో మాత్రం తనకు కారు గానీ టూ వీలర్ గానీ లేదని పొందుపర్చారు. తన ఆస్తులు విలువ రూ.5,66,81,321, భార్య పేరుపై రూ.8,06,81,241 ఉన్నాయని పేర్కొన్నారు. చేతిలో రూ.9,52,450 నగదు, భార్య వద్ద రూ. 8,15,625 నగదు ఉందని పొందుపరిచారు. తనకున్న వివిధ రకాల భూముల మార్కెట్ విలువ రూ.10,34,86,418గా ఆమంచి చూపించారు.

కూటములెన్ని వచ్చినా గెలుపు ఆపలేరు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో– ఆర్డినేటర్, ఎంపీ అయోధ్య రామిరెడ్డి
- అట్టహాసంగా పర్చూరు అభ్యర్థి యడం బాలాజీ నామినేషన్
- స్వచ్ఛందంగా వేలాదిగా తరలిన జనం
- దారిపొడవునా పూలు, గజమాలలతో స్వాగతం
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్



నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): కూటములు ఎన్ని కలిసి వచ్చినా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గెలుపును అడ్డుకోలేరని ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి అన్నారు. పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ నామినేషన్ కార్యక్రమంలో ఆయనతో పాటు బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ పాల్గొన్నారు. మార్గంమధ్యలో దేవాలయాలు, చర్చిలలో ఆయన ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. భారీ ర్యాలీతో పర్చూరు బొమ్మల సెంటర్ చేరుకొన్న అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అయోధ్య రామిరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని.. వారి కోసమే పని చేస్తుందని తెలిపారు. పేదల సంక్షేమమే పార్టీకి ముఖ్యమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని, పర్చూరులో యడం బాలాజీ శాసన సభ్యుడుగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని జోస్యం చెప్పారు.

చంద్రబాబు ఒక్క పథకం గుర్తుపెట్టుకునేలా చేశారా : ఎంపీ సురేష్

బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని 15 సంవత్సరాలు పాటు పాలించిన చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన మంచి పథకం గురించి చెప్పమంటే చెప్పలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. అయితే, ఒక్క దాని గురించి మాత్రం చెప్పగలమని, అదే వెన్నుపోటు పథకం అని విమర్శించారు. సీఎం జగన్ మోహనరెడ్డి పాలనలో ఎన్నో పేద, మధ్యతరగతి కుటుంబాలు సంక్షేమ పథకాలు అందుకున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ గుండెల మీద చేయి వేసుకొని తమ ముఖ్యమంత్రి జగనేనని ఘంటాపథంగా చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ తమ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన వైనాట్ 175 సాధించి ఆయన మాటను నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

రుణం తీర్చుకుంటాం: బాలాజీ

పార్టీ అభ్యర్థి యడం బాలాజీ మాట్లాడుతూ రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఘంటాపథంగా చెప్పారు. నియోజకవర్గ ప్రజల తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. కుటుంబంలో పెద్దకొడుకుగా ఉంటానని చెప్పారు. తనకు రుణం తీర్చుకునే అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు కల్పించాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రావి రామనాథంబాబు, చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్, ఎంపీపీ మేకా ఆనందకుమారి, నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, రాష్ట్ర డైరెక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మైలా చిననాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కట్టా రత్నరాజు, జువ్వా శివరాంప్రసాద్, నాయకులు గాజుల రమేష్, గాదె సురేష్, కంచెనపల్లి రమేష్, ఆకుల హేమంత్, షేక్ కాలేషా, కూరాకుల ఇస్సాక్, బండి రాంబాబు, కొట్టే ప్రభుదాసు పాల్గొన్నారు.

మరో సెట్ నామినేషన్ దాఖలు చేసిన బాలాజీ



పర్చూరు ఆర్వోకు నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి బాలాజీ

పర్చూరు (చినగంజాం): పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ మంగళవారం మరో నామినేషన్ సెట్‌ను తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో జి.రవీందర్‌కు సమర్పించారు. ఈ నెల 19వ తేదీ మంచిరోజు కావడంతో ఆయన మొదటి సెట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం నాయకులు, కార్యకర్తలతో వచ్చి మరో సెట్‌ను దాఖలు చేశారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ తరఫున ఆయన సోదరుడు గోపాళం లక్ష్మీదీపక్ మరో నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో తెలిపారు. కాగా మొత్తం మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయని చెప్పారు.

రెడీమేడ్ నేతలు.. టిప్ టాప్ ప్రచారాలు

- అమ్మకానికి చోటామోటా నాయకులు
- భారీగా రేట్లు పెంపు
- రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షలు పలుకుతున్న ధర



చీరాల: వాళ్లు చోటా మోటా నాయకుల కంటే ఇంకా తక్కువ స్థాయే. ఎన్నికల సమయాల్లో వీళ్ల హడావుడి అంతాఇంతా కాదు. ఉదయాన్నే ఇంటి నుంచి ఖద్దరు బట్టలు వేసుకుని బయలుదేరుతారు. సాయంత్రం వరకు చీరాల్లోనే గడిపి రాత్రికి గూటికి చేరుతారు. టీ స్టాల్ రాజకీయాలు వీరికి పెట్టింది పేరు. కేవలం గొంతుతోనే బతికేస్తుంటారు. వీరు అన్ని పార్టీలతో సత్సంబంధాలు కలిగి ఉంటారు. అందుకే ఎన్నికల సమయాన వీళ్లకి బాగా డిమాండ్.

కెపాసిటీని బట్టి ధర

చీరాల్లో ప్రతిపక్ష టీడీపీ, ఇటీవల ఓ జాతీయ పార్టీలోకి వెళ్లిన నేత చోటా నాయకుల కొనుగోళ్ల పర్వానికి తెరలేపారు. చీరాల నియోజకవర్గంలోని మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో, గ్రామ పంచాయతీల్లో నాయకులను ఎంచుకుని నేరుగా బేరసారాలు జరుపుతున్నారు. ప్రధానంగా తీర ప్రాంత గ్రామాలను సైతం గంపగుత్తగా రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేసినట్లు ఆయన టీం ద్వారా ప్రచారాలు చేయిస్తున్నారు.ప్రతి నాయకుడికీ రేటు కట్టి కొనుగోలు చేసి లోబరుచుకుంటున్నారు. ప్రధానంగా ఓ జాతీయ పార్టీకి నాయకుడైతే ఆ పార్టీ, ఈ పార్టీ అని చూడకుండా నాయకుడి కెపాసిటీని ధర ముట్టచెబుతున్నాడు. క్యాడర్ లేక కొట్టుమిట్టాడుతున్న ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సైతం అదే పంథాను అవలంబిస్తోంది. ఒక నాయకుడినే రెండు పార్టీలు కొనుగోలు చేయడం విశేషం. అయితే, ఇదే చోటా నాయకుడు మరుసటి రోజు నుంచి మరో పార్టీ ర్యాలీల్లో కనిపించడం విశేషం.

తీర ప్రాంత గ్రామాల్లో భారీగా ఓట్ల కొనుగోలు

ఇటీవల వేటపాలెం మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన కఠారివారిపాలెం, రామచంద్రాపురం, రామాపురం, టెంకాయచెట్లపాలెం, చీరాల మండలంలోని వాడరేవు, చిన్నబరప, పెద్దబరప, విజయలక్ష్మీపురం గ్రామాలకి చెందిన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వారిని చోటామోటా నాయకుల సాయంతో గంపగుత్తగా రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేశానని ప్రచారం చేసుకుంటున్నాడు ఓ జాతీయ పార్టీ నేత. అయితే, వారంతా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తితో సఖ్యతగా ఉండటంతో పాటు వైస్సార్ సీపీకి వెన్నుదన్నుగా ఉంటున్నారు. ఆ జాతీయ పార్టీ నేత మాత్రం తనకు అందరు సహకరిస్తున్నారని అంటున్నాడు. ‘నా వెంట మీరు ఉండండి.. మీ వెంట నేనున్నా’ అంటూ హామీ ఇస్తున్నాడు. ఎన్నికల తేదీలు దగ్గర పడటంతో నియోజకవర్గంలో మాత్రం చోటా మోటా నాయకులు బిజీగా ఉంటున్నారు. ఏ రోజు ఏ పార్టీలో ఉంటారో .. ఎవరి వర్గంలో పయనిస్తారో ఏమో గానీ ఎన్నికల పుణ్యమా అని నాలుగు రూపాయలు వెనకేసుకుంటున్నారు. ప్రస్తుతం చీరాల్లో వీరికి బాగా డిమాండ్ ఏర్పడింది.

రూ. లక్షల్లో పలుకుతున్న ధర

చీరాల నియోజకవర్గంలోని 24 గ్రామ పంచాయతీలు, 33 మున్సిపల్ వార్డులు ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో ఎక్కువగా కుల సంఘాలు, కొన్ని ప్రజాసంఘాల నాయకులను వారి స్థాయి, ఓటర్లను ప్రభావితం చేసే విధానాన్ని బట్టి రేట్ ఫిక్స్ చేశారు. ఇటీవల కొత్తపేటకు చెందిన ఓ నాయకుడికి జాతీయ పార్టీ నేత భారీగా నగదును ముట్టజెప్పి తనవైపు తిప్పుకున్నాడనే ప్రచారం జోరుగా జరుగుతోంది. చీరాల మండలంలోని దేవినూతల నుంచి వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి గ్రామ పంచాయతీ వరకు మాజీ వార్డు మెంబర్లు, మాజీ నాయకులను ఈ రెండు పార్టీలు వలవేసి డబ్బులను ఆశచూపి తమ వైపు లాక్కుంటున్నాయి. కనీసం 30 ఓట్లను ప్రభావితం చేసే చోటా నేత నుంచి 100 ఓట్ల వరకు వేయించే వారికి రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు చెల్లిస్తున్నారు.

జిల్లాలో నామినేషన్ల జోరు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లావ్యాప్తంగా మంగళవారం పెద్దఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. బాపట్ల పార్లమెంటరీ నుంచి కాంగ్రెస్ పార్టీ పార్టీ అభ్యర్థిగా జేసుదాస్ శీలం, టీడీపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్, స్వతంత్ర్య అభ్యర్థులుగా దేవరపల్లి పాపారావు, కట్టా ఆనంద్‌బాబు నామినేషన్లు దాఖలు చేశారు.

- పర్చూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా యడం బాలాజీ నామినేషన్ దాఖలు చేశారు. మరో సెట్‌ను ఆయన సోదరుడు గోపాళం దీపక్ వేశారు. టీడీపీ అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు దాఖలు చేశారు.
- అద్దంకి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కిశోర్ బాబు నామినేషన్ దాఖలు చేశారు.
- బాపట్ల నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా వేగేశన నరేంద్రవర్మ, కాంగ్రెస్ పార్టీ తరఫున పఠాన్ మహబూబ్ ఖాన్, వీసీకేపీ అభ్యర్థిగా చంద్రశేఖరరావు నామినేషన్ వేశారు.
- రేపల్లె నుంచి స్వతంత్ర్య అభ్యర్థులుగా బొర్రా శ్రీనివాసరావు, బొడ్డు నాగేశ్వరరావు, జయభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా రామరాజు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా అంగిరేకుల ఆదినారాయణ, ఇండియన్ ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా సదాశివరావు నామినేషన్ దాఖలు చేశారు.
- చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ తరఫున వెంకటేశ్వర్లు, స్వతంత్ర్య అభ్యర్థులుగా పఠాన్, కాలేషాలు నామినేషన్ దాఖలు చేశారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం నిరవధిక వాయిదా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిరవధికంగా వాయిదా పడింది. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి జెడ్పీ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. ఎన్నికల కోడ్ కారణంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నుంచి అనుమతి పొంది ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.00 గంటలకు జరగాల్సిన సమావేశంలో 3.15 గంటల వరకు సభ్యులు పెద్దగా హాజరు కాలేదు. మొత్తం 54 మంది సభ్యుల్లో 10 మంది హాజరయ్యారు.

క్లుప్తంగా

ఐదో రోజు నాలుగు నామినేషన్లు



చీరాల టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఐదవ రోజు నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తరపున రెండో సెట్ నామినేషన్ అందించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పఠాన్ కాలేషా, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ తరపున శీలం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్ తమ నామినేషన్లు ఆర్వోకు అందజేశారు. నామినేషన్ల స్వీకరణకు మరో రెండు రోజులే గడువు ఉండటం, గురువారం మధ్యాహ్నం మూడు గంటల్లోపు ఎవరైనా నామినేషన్లు అందించవచ్చని ఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ



బాపట్ల: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని డీఎం అండ్ హెచ్ఓ విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కార్యాలయంలో మలేరియా నిర్మూలన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మలేరియా నిర్మూలనకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలు దోమ తెరలు వాడాలని, దోమకాటు నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు టి.వెంకటేశ్వర్లు, వై.రాజకుమార్, షకీల్, జూగుంట రాంబాబు పాల్గొన్నారు.

వెలవెలబోయిన షర్మిల సభ

తెనాలిరూరల్: తెనాలిలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిర్వహించిన బహిరంగ సభ వెలవెలబోయింది. ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఇక్కడి పురవేదిక వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకే సభ అని ప్రచారం చేశారు. రాత్రి 8.33 గంటలకు ఆమె వేదికపైకి వచ్చారు. అప్పటికే సమీకరించిన జనంలో సగం మంది వరకు వెళ్లిపోయారు. ఇక షర్మిల ప్రసంగించే సమయంలోనూ ప్రజలు వెళ్లిపోయారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న యడం బాలాజీ

కూటమికి కునుకు కరువయ్యేలా..

పేదల పార్టీకి.. ప్రజా మద్దతు లభించింది. మంగళవారం పర్చూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ నామినేషన్ ర్యాలీకి జననీరాజనం పలికింది. ప్రతిపక్ష కూటమికి కంటిమీద కునుకు కరువయ్యేలా జన జాతరను తలపించింది. ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ వెంట రాగా.. ర్యాలీ కాదది.. విజయోత్సవ యాత్ర అన్నట్లు సాగింది.
– పర్చూరు (చినగంజాం)



బాలాజీ నామినేషన్ ర్యాలీలో జన జాతర



పర్చూరులో యడం బాలాజీకి ఘన స్వాగతం



ఎంపీ నందిగం సురేష్‌తో సెల్ఫీ దిగుతున్న అభిమానులు



ట్రాక్టర్‌లో మహిళా కూలీలకు అభివాదం చేస్తున్న ఎంపీ సురేష్

వెంకటేష్ గెలుపునకు పనిచేస్తాం

- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు
- సాదరంగా ఆహ్వానించిన కరణం వెంకటేష్

చీరాల టౌన్: వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ గెలుపునకు సమష్టిగా కృషి చేస్తామని మున్సిపాలిటీలోని 2వ వార్డు నాయకులు, ప్రజలు మద్దతు తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక నాయకులు తిమోతీ, దాస్, మోహన్, అజయ్, చింటు, రాకేష్, ప్రదీప్, వందనం, పవన్, బాబీ, షాలెం, సల్మాన్, జిలానీ, శివ తదితరులు కరణం వెంకటేష్‌ను కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ఎంతోమంది బడుగు, బలహీన వర్గాల ప్రజలు లబ్ధి పొందారన్నారు. సీఎంగా జగనన్నను, చీరాల ఎమ్మెల్యేగా తన గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటీలోని 300 కాలనీకి చెందిన వంగర అమర



వైఎస్సార్ సీపీకి మద్దతు ప్రకటిస్తున్న దేవాంగపురి టీడీపీ నాయకులు

లింగయ్య, కారంపూడి దుర్గాబాయి. జి.శ్యామ్ సుందర్, టి.ప్రసాద్ మరికొందరు వైఎస్సార్ సీపీకి మద్దతు ప్రకటించారు. దేవాంగపురి పంచాయతీ అయోధ్య నగర్‌కు చెందిన టీడీపీ నాయకులు బండ్ల మోహన్, జకుల నాగేశ్వరరావు, బి.జీవేశ్వరరావు వైఎస్సార్ సీపీలో చేరారు.



కరణం వెంకటేష్‌కు మద్దతు తెలిపిన రెండో వార్డు నాయకులు

ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- ఎంపీ మోపిదేవి, వైఎస్సార్ సీపీ రేపల్లె అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్
- రేపల్లె మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

రేపల్లె రూరల్: ప్రజా సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామం నుంచి రుద్రవరం గ్రామం వరకు మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన నవరత్నాల పథకాలు ఎంతగానో దోహదం చేశాయన్నారు. జగనన్న గాంధీజీ కలలు గన్న గ్రామ సచివాలయాల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తుచేశారు. గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టడం ఆయనకు తెలియదన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపించే జగనన్న బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రజలకు మంచి జరుగుతుందన్న వాస్తవం గత ఐదేళ్ల పాలనలో తేటతెల్లమైందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలను ఆపకుండా ప్రజలకు అందించిన ఏకైక దమ్మున్న నాయకుడు జగనన్న అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజార్టీ చేకూర్చాలని కోరారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలు, చర్చిలలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో మహిళలు, యువకులు నాయకులకు ఘనస్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. లంకెవానిదిబ్బ,



రాజుకాల్వలో ప్రజల మద్దతు కోరుతున్న ఎంపీ మోపిదేవి, అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్

రాజు కాల్వ, గంగడిపాలెం, చెన్నుపల్లివారిపాలెం, పిరాట్లంక, చోడాయపాలెం, మోర్తోట, చాత్రగడ్డల మీదుగా రుద్రవరం వరకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు అడపా శేషు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, నాయకులు మోపిదేవి రాజీవ్, ఈవూరి సృజన్, గరికపాటి భానుకోటి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక

సాదరంగా ఆహ్వానించిన ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించే విధంగా శక్తివంచన లేకుండా ప్రతి ఒక్కరూ పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన తమ్మా రామ్మోహనరావుతో పాటు 20 టీడీపీ కుటుంబాల సభ్యులు మంగళవారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మోపిదేవి

మోపిదేవి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చురుకుగా పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోపిదేవి రాజీవ్, గరికపాటి భానుకోటి పాల్గొన్నారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

చుండూరు(వేమూరు): కాల్వలో పడి కాజా రామకృష్ణ(30) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన నడిగడ్డవారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చుండూరు మండలం నడిగడ్డవారిపాలేనికి చెందిన కాజా రామకృష్ణ సోమవారం తెలుగు దేశం పార్టీ వేమూరు అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడ టీడీపీ నాయకులు పంపిణీ చేసిన మద్యం సేవించి, సాయంత్రం ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో స్థానికంగా ఉన్న కాల్వ వద్దకు మూత్ర విసర్జనకు వెళ్లగా.. కాలు జారి అందులో పడిపోయి మృతి చెందాడని తెలిపారు. పోలీసులకు సమాచారం తెలియజేయడంతో కాల్వలో ఉన్న మృతిదేహాన్ని.. తెనాలి ప్రభుత్వం వైద్య శాలకు తరలించినట్లు ఎస్ఐ మహ్మద్ రఫీ తెలిపారు. మంగళవారం పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

ఎస్సై నాగశివారెడ్డికి షోకాజ్ నోటీసులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం విధులలో ఉన్న ఎస్సై నాగ శివారెడ్డి టీడీపీ కార్యకర్తలను దూషించిన విషయమై ఎస్పీ వకుల్ జిందాల్ షో కాజ్ నోటీసులు జారీ చేశారు. పర్చూరు తహసీల్దారు కార్యాలయం మెయిన్ గేటు వద్ద విధి నిర్వహణలో ఉన్న ఎస్సై నాగ శివారెడ్డి టీడీపీ కార్యకర్తలను అసభ్యకర పదజాలంతో దూషించాడని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వయంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఎస్సై నాగశివారెడ్డిని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పిలిపించి, సదరు విషయమై వివరణ కోరారు. అనంతరం ఎస్సైకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విచారణ అధికారిగా బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను నియమించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న నాగశివారెడ్డిని అన్నంబొట్లవారిపాలెం చెక్ పోస్ట్ విధులకు ఎస్పీ పంపించారు.

మహిళల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ ఉమా మహేశ్వరీ దేవి

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరీదేవి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల 82వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానాన్ని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం కేంద్ర మార్గ దర్శకాలకు అనుగుణంగా మహిళా విద్యాభివృద్ధి దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. కళాశాల విద్య ఆర్జేడీ డాక్టర్ పి.కళావతి మాట్లాడుతూ ప్రతి మహిళ డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగాన్ని అందిపుచ్చుకునే విధంగా విద్యాశాఖ శిక్షణను అందిస్తోందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమాజ్యోత్స్న కుమారి మాట్లాడుతూ అటానమస్ హోదాతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా 24 కోర్సులు నిర్వహిస్తూ, ప్రత్యేక శిక్షణ ద్వారా ఉద్యోగావకాశాలను సైతం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది నుంచి జాతీయ విద్యా ప్రణాళికలో కళాశాల చేరిందని, ఆరు కంప్యూటర్ కోర్సులకు గానూ 25 కంప్యూటర్లను సమకూర్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థినులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, ఎండోమెంట్ నగదు పురస్కారాలు అతిథులచే అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం లింకన్, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ కె.సుబ్బరత్నమ్మ, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ధాత్రి కుమారి, డాక్టర్ షాహిదా అక్తర్, అధ్యాపకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ఉమా మహేశ్వరీదేవి, ఆర్జేడీ కళావతి, ప్రిన్సిపల్ వీఆర్ జ్యోత్స్నకుమారి

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం- 2024 వేడుకలను బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థాన ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. రామరాజు లక్ష్మీ శ్రీనివాసరావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం కోల్‌కొత్తాకు చెందిన ఆత్రేయి దత్త ఒడిస్సీ, బెంగాల్‌కు చెందిన సందీప్ కుందు కూచిపూడి, గరిణి సాయికుమార్, సంతోష్ కుమార్ పేరిణి శివతాండవాన్ని ప్రేక్షక జన రంజకంగా ప్రదర్శించారు. వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం కళాకారులను నృత్య శిరోమణి, యువ కళారత్న బిరుదులతో సత్కరించారు. కార్యక్రమాలను సంస్థ కోశాధికారి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణి పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఏఎంజీ విద్యార్థి

చిలకలూరిపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ అండర్ -19 పోటీలు ఇటీవల విజయవాడలోని మేరీ స్టెల్లాస్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ పోటీ స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గుంజి మనోజ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి హర్యానాలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడు. ఈ విద్యార్థికి ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఏఎన్‌యూలో నాక్ బృందం పర్యటన

ఏఎన్‌యూ: నాక్(నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ బుధవారం నుంచి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో పర్యటించనుంది. నాక్ సభ్యుల బృందం పర్యటన మూడు రోజుల పాటు కొనసాగనుంది. యూనివర్సిటీ సందర్శనలో భాగంగా ముందుగా నాక్ బృంద సభ్యులు యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా యూనివర్సిటీ సమగ్రాభివృద్ధిని కమిటీకి వివరిస్తారు. అనంతరం యూనివర్సిటీ ఐక్యూఏసీ నివేదికను కమిటీకి సమర్పిస్తుంది. అనంతరం కమిటీ సభ్యులు బృందాలుగా వర్సిటీలోని అన్ని కార్యాలయాలు, విభాగాలను సందర్శించి వాటిలోని వసతులు, సేవలు, రికార్డులను పరిశీలిస్తారు. నాక్ పర్యటన సందర్భంగా యూనివర్సిటీ అధికారులు ఎనిమిది ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీల సభ్యులు నాక్ కమిటీ సభ్యులకు అవసరమైన సహకారం అందిస్తారు. ఈ మూడు రోజుల పర్యటనలో నాక్ సభ్యులు యూనివర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు, పూర్వ విద్యార్థులు, యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడతారు. వారి నుంచి సమాచారం సేకరిస్తారు. యూనివర్సిటీలోని విద్య, పరిశోధన, బోధన, మౌలిక వసతులు, క్రీడా ప్రమాణాలు, యూనివర్సిటీ అందిస్తోన్న సేవలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాల ప్రామాణికంగా కమిటీ యూనివర్సిటీకి నాక్ గ్రేడ్‌ను ప్రతిపాదిస్తుంది.